క్లుప్తంగా

డ్వాక్రా సంఘ సభ్యులు ఆర్థికంగా బలపడాలి



డ్వాక్రా సభ్యులతో సమావేశమైన డీపీఎం శ్రీనివాసరావు

మునగపాక: డ్వాక్రా సంఘ సభ్యులంతా ఆర్థికంగా బలపడాలని డీఆర్‌డీఏ డీపీఎం శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని టి.సిరసపల్లిలో మంగళవారం ఆయన డ్వాక్రా సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. సంఘ నిర్వహణ, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. బ్యాంకు రుణాలు, వాటి చెల్లింపులపై ఆరా తీశారు. బ్యాంకు రుణాలు సద్వినియోగమయ్యేలా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు సంఘ సభ్యులు సమావేశమవుతూ సంఘాలను బలోపేతం చేసుకోవాలన్నారు. సీసీ శ్రీను, వీవోఏ ఉష తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

కె.వి.పురంలో పారిశుధ్య డ్రైవ్



ఇళ్ల నుంచి చెత్తను సేకరిస్తున్న పారిశుధ్య కార్మికుడు

కోటవురట్ల: కె.వెంకటాపురంలో మంగళవారం పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పారిశుధ్య కార్మికులు ఇళ్ల నుంచి చెత్తను సేకరించి, వీధులను శుభ్రం చేశారు. డ్రైనేజీలలో పూడికలు తీశారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ మాట్లాడుతూ స్వచ్ఛ గ్రామం సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఇంటితో పాటు వీధులను శుభ్రంగా ఉంచుకోవలసి బాధ్యత అందరిపై ఉందన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



కొడవటిపూడిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

కోటవురట్ల: కార్పొరేట్‌కు దీటుగా మీ పిల్లలకు మంచి విద్యను అందిస్తాం.. వారి చదువుకు ఒక్క పైసా ఖర్చు చేయనవసరం లేదంటూ సర్కారు బడి ఉపాధ్యాయులు రోడ్డెక్కారు. ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కలుసుకుని నాణ్యమైన విద్యను అందిస్తామంటూ వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తున్న సదుపాయాలు, బోధన గురించి వివరించి కరపత్రాలు పంచారు. కార్పొరేట్‌పై మోజుతో డబ్బులు ఖర్చు చేసి చేతులు కాల్చుకోవద్దని, ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగానే బోధిస్తారని వివరించారు. కొడవటిపూడి ఎంపీయూపీ స్కూల్ ఉపాధ్యాయులు ఆర్.ప్రతాప్‌కుమార్, పావని, సునాద, కృపామణి, లోవరాజు, నాగూర్ బాషా, శంకర్, స్కూల్ కమిటీ చైర్మన్ యలమంచిలి శ్రీనివాసరావు, గ్రామ పెద్ద దొరబాబు, సీనియర్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అధికారులపై చర్యలకు డిమాండ్



నిరాహార దీక్షలో కూర్చొన్న ఆర్టీసీ కార్మికులు

అనకాపల్లి టౌన్: తప్పుడు కేసులు రాసిన ఆర్టీసీ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎన్‌ఎంయూఏ రీజనల్ కార్యదర్శి పి. సుధాకర్ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ఆవరణలో కార్మికులు చేస్తున్న రిలే దీక్షలు మంగళవారానికి 39వ రోజుకు చేరుకున్నాయి. బస్సు డ్రైవర్ ఎంఎ రావు, కండక్టర్ ఎస్ ఎస్ నారాయణలపై అక్రమ సస్పెన్షను ఎత్తి వేయాలన్నారు.

'మార్కెట్ ధర ప్రకారమే నష్టపరిహారం'



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

అచ్యుతాపురం రూరల్: అనకాపల్లి నుంచి అచ్యుతాపురం రహదారి విస్తరణలో భూములు, ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ యలమంచిలి ఇన్‌చార్జి తనకాల అనంతరావు కోరారు. ఈ మేరకు మంగళవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ 15 ఏళ్ల క్రితం మార్కెట్ ధరను పరిగణనలోకి తీసుకోవడం అన్యాయమన్నారు. గ్రామీణ ప్రజలకు టీడీఆర్‌తో పెద్దగా ఉపయోగం లేదన్నారు. చిరు వ్యాపారులకు నష్టపరిహారంతో పాటు ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ఎంపీఆర్ రాహుల్, రావి రామసత్యం, పొలమరశెట్టి ఆదిమూర్తి పాల్గొన్నారు.





రామచంద్రపురం శివారు పైలెట్ ప్రాజెక్టు ప్రదేశం

ఈత సరదా.. తస్మాత్ జాగ్రత్త



జల్లూరు వరాహనదిలో ప్రమాదకర నీటి గుంత

కోటవురట్ల: వేసవి సెలవులొస్తే చిన్నారుల సందడికి హద్దే ఉండదు. ఆట పాటలతో హుషారుగా గడిపేస్తారు. ఇంకాస్త అల్లరి జోడైతే ఈత సరదాతో తల్లిదండ్రుల కళ్లు కప్పి ప్రమాదపు అంచులకు వెళ్తారు. సరిగ్గా ఇక్కడే తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పుడు ఒంటిపూట బడులు నడుస్తున్నాయి. మరికొద్ది రోజుల్లో పూర్తి సెలవులొస్తాయి. అప్పుడు మరింత జాగ్రత్తగా పిల్లలను గమనించాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఈత సరదా పిల్లల ఆలోచనను పూర్తిగా చంపేస్తుంది. ప్రమాదం ఉందన్న జ్ఞానం ఆ చిన్ని బుర్రలకు తట్టవు. ఒకరికొకరు పోటీగా నదులు, బావులు, నీటి గుంతల్లో దూకి కేరింతలు కొడతారు. ఈ పరిస్థితుల్లో పిల్లలను ఓ కంట కనిపెడుతూ జాగ్రత్తగా ఉంచాలి. మండలంలో పలు ప్రాంతాలలో మృత్యు కుహరాలు మాటేసి ఉన్నాయి. ఇప్పటికే ఎన్నో ప్రాణాలను మింగేసిన ఈ ప్రదేశాలు నిశ్శబ్దంగా పిల్లలను ఆకర్షిస్తూ ఎదురు చూస్తున్నాయి.

కానరాని హెచ్చరిక బోర్డులు

ఇలా ఈత సరదా, స్నానానికి దిగి మృతి చెందిన వారు ఎందరో ఉన్నారు. అయినప్పటికీ ఈ ప్రదేశాలలో ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ వేసవి కాలంలో ఈ ఘటనలు పునరావృతం అవుతూనే ఉన్నాయి. వేసవి సెలవులొస్తే ఊబులపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అధికారులు మాత్రం సెలవుల్లో పిల్లలను ఓ కంట కనిపెట్టాలని సూచిస్తున్నారు. లేదంటే తీరని వేదన మిగిలే ప్రమాదం లేకపోలేదు. అధికారులు మృత్యు కుహరాల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు ఇనుప కంచె ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

మచ్చుకు కొన్ని ప్రమాదాలు..

- వరాహనదిలో పలు ప్రాంతాలలో నీటి గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. వీటిలో ఊబులు ఉండడంతో పలువురు మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి.
- జల్లూరు శివారు ఆత్మలింగేశ్వరస్వామి ఆలయం చెంతన వరాహనదిలో నీటి గుంత ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ గుడికి వచ్చిన భక్తులు నదిలో స్నానాలు ఆచరిస్తారు. ఇక్కడే వంతెనకు సమీపంలో పెద్ద ఊబి ఉండడంతో గతంలో ఇద్దరు యువకులు ఈతకు దిగి మృత్యువాత పడ్డారు.
- కోటవురట్ల శివారు గవరపేట సమీపంలోని వరాహనదిలో గతంలో ఈతకు దిగి ఓ వ్యక్తి ఊబిలో కూరుకుపోయాడు.
- రామచంద్రపురం శివారు పైలట్ ప్రాజెక్టు వద్ద ఊబి ఉండడంతో ఇక్కడా గతంలో ఓ మహిళ, ఓ వ్యక్తి మృతి చెందారు.
- పందూరు వంతెన వద్ద స్నానానికి దిగి ఓ వ్యక్తి మృత్యువాత పడ్డాడు.

ఆదమరిస్తే ప్రమాదమే..



సెలవుల్లో పిల్లలను వదిలి ఆదమరిస్తే ప్రమాదమే. వారిని ఓ కంట కనిపెడుతూ ఉండాలి. నదుల్లోకి ఈతకు వెళ్లకుండా జాగ్రత్త పడాలి. జల్లూరు వంతెన వద్ద గతంలో ఇద్దరు యువకులు ఈతకు దిగి ఊబిలో కూరుకుపోయి మృతి చెందారు. ఇక్కడ ప్రమాదకర ఊబి ఉంది. తల్లిదండ్రులు పిల్లల పట్ల శ్రద్ధ వహించాలి. స్నానానికి దిగేవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

– చక్కా సుజాత, వైస్ ఎంపీపీ, జల్లూరు

పిల్లల పట్ల శ్రద్ధ వహించాలి



సెలవుల్లో పిల్లల పట్ల శ్రద్ధ తీసుకోవాలి. వాళ్లు ఏం చేస్తున్నారు. ఎక్కడికి వెళ్తున్నారు. ఇలాంటి అంశాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి. చాలా మంది పిల్లలు తల్లిదండ్రులకు చెప్పకుండా ఈతకు వెళ్లే ప్రమాదం ఉంది. ఓ కంట కనిపెడుతూ వాళ్లను హెచ్చరించాలి. స్థానికంగా పంచాయతీల పరిధిలో ఇటువంటి స్థలాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలి.

– రమేష్, ఎస్‌ఐ, కోటవురట్ల

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

మునగపాక: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. 9వ తేదీన వాడ్రాపల్లి, చెర్లోపాలెం, 10న నాగులాపల్లి, నాగవరం, 11న అరబుపాలెం, పాటిపల్లి గ్రామ సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు

మునగపాక: మండలంలోని నాలుగు పంచాయతీల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలి(ఆయా) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో ఎం.ఉషారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తోటాడ పంచాయతీ మూలపేట(ఎస్సీ), టి.సిరసపల్లి పంచాయతీ సిరసపల్లి-1 (బీసీ-డీ), తిమ్మరాజుపేట-1(బీసీ-సీ), మునగపాక-4(బీసీ-ఈ)కు సంబంధించి ఆయా పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ఈ నెల 17వ తేదీలోగా అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు మండల పరిషత్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

పాస్టర్స్ ఫెలోషిప్ కార్యవర్గం నియామకం



మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం

పాయకరావుపేట: మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని నియమించినట్టు పాస్టర్లు తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా పి.ఐజయ్య, అధ్యక్షుడిగా ఎం.ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ఎం.విజయ్ కుమార్, కార్యదర్శిగా బి.అరుణ్ కుమార్, జాయింట్ సెక్రటరీగా డి.శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా డి.నాని, జాయింట్ ట్రెజరర్‌గా డి.ఇషాక్, మెంబర్స్‌గా సతీష్ కుమార్, పి.ఇషాక్, కె.కారల్ ఫాల్ స్టీవెన్, ప్రసన్న కుమార్ నియామకం అయినట్లు పేర్కొన్నారు.

తిమ్మరాజుపేటలో అధికారులకు నిరసన సెగ

టీడీఆర్ బాండ్లపై సమావేశమైతే వద్దంటూ నిర్వాసితుల ఆగ్రహం



తిమ్మరాజుపేటలో ఆందోళన చేస్తున్న నిర్వాసితులు



అధికారుల తీరును తప్పపడుతున్న ఉప సర్పంచ్ జగన్

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణకు సంబంధించి మంగళవారం తిమ్మరాజుపేటలో టీడీఆర్ బాండ్ల వినియోగంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో అధికారులకు నిరసన సెగ తగిలింది. స్థానిక సచివాలయ ప్రాంగణంలో తిమ్మరాజుపేట రెవెన్యూ పరిధిలోని నిర్వాసితులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వాసితులను ఉద్దేశించి అధికారులు మాట్లాడే ప్రయత్నం చేస్తుండగా, ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్ అడ్డుకున్నారు. నిర్వాసితులకు ఇచ్చే పరిహారాన్ని నేరుగా ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చాకే మాట్లాడాలని, టీడీఆర్ బాండ్లపై అవగాహన కల్పిస్తామంటే ఒప్పుకునేది లేదని తెగేసి చెప్పారు. ఇందుకు పలువురు నిర్వాసితులు జగన్‌కు మద్దతు పలికారు. దీంతో అధికారులు ఏం చేయాలో తెలియక సమావేశ మందిరం నుంచి బయటకు వచ్చేశారు. అనంతరం నిర్వాసితులంతా తిమ్మరాజుపేట రోడ్డుపై ఆందోళనకు దిగారు. సీపీఎం నాయకులు కర్రి అప్పారావు, బ్రహ్మాజీ తదితరులు మాట్లాడుతూ పూడిమడక రోడ్డు విస్తరణకు సంబంధించి పరిహారాన్ని నేరుగా అకౌంట్‌లో జమ చేయాల్సిందేనన్నారు. రెవెన్యూ అధికారులు గతంలో ఇచ్చిన హామీలు బుట్ట దాఖలయ్యాయన్నారు. 2023 భూ సేకరణ చట్టం అమలు చేయాల్సిందేనన్నారు. ఇప్పటికైనా పునరాలోచించి ప్రతి నిర్వాసితునికి మేలు చేయాలని, లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామంటూ హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అచ్యుతాపురం: అచ్యుతాపురం-అనకాపల్లి రహదారి విస్తరణలో భాగంగా పనులకు, విస్తరణకు అడ్డంకిగా ఉన్న భారీ వృక్షాలను తొలగించే ప్రక్రియ ఉన్నందున అచ్యుతాపురం పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ(ఆపరేషన్స్) రాజశేఖర్ తెలిపారు. అచ్యుతాపురం టౌన్, మోసయ్యపేట, చోడపల్లి, భోగాపురం, రామన్నపాలెంలో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా నిలిపివేస్తున్నందున వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా రథోత్సవం



మునగపాకలో రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: మండలంలో మునగపాక, అరబుపాలెం గ్రామాల్లో మంగళవారం సీతారాముల రథోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా ఆయా గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో రథోత్సవం నిర్వహించారు. మునగపాక పంచాయతీ వీధిలోని రామాలయ ప్రాంగణంలో నూతనంగా తయారు చేసిన రథాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ ప్రారంభించారు. పలువురు భక్తులు సీతారాములను దర్శించుకున్నారు. దీనిలో భాగంగా ఏర్పాటు చేసిన కోలాటం ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. గ్రామపెద్దలు పొలిమేర కృష్ణ, ఆడారి లక్ష్మణరావు, పెంటకోట సత్యనారాయణ, మొల్లేటి సత్యనారాయణ, ఆడారి కాశీబాబు, జల్లేపల్లి కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన పాల దిగుబడులపై దృష్టి



మాట్లాడుతున్న పశువైద్యాధికారి ప్రదీప్‌కుమార్

మునగపాక: మెరుగైన పాల దిగుబడులపై దృష్టి సారించాలని మండల పశువైద్యాధికారి లావేటి ప్రదీప్‌కుమార్ కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహిస్తున్న వార్షిక రుణం, జీవనోపాధుల ప్రణాళికలకు సంబంధించి వీవోఏలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ రైతులకు సంబంధించి పలు పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు. పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెరుగైన పాల దిగుబడులకు సంబంధించి రైతులకు అవగాహన పెంచాలన్నారు. డ్వాక్రా మహిళలు వ్యవసాయంలో రాణించేలా ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడాలన్నారు. ఏపీఎం బాలరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీసీలు వేణు, రామకృష్ణ, అనురాధ, శ్రీను, నిర్మల, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం



ఎస్‌ఐ ప్రసాదరావు

మునగపాక: ప్రతి ఒక్కరూ సైబర్ మోసాలపై అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్‌ఐ పి.ప్రసాదరావు కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొంతమంది సైబర్ మోసగాళ్లు కొన్ని లింక్‌లను వాట్సాప్ గ్రూపుల ద్వారా పంపిస్తున్నారన్నారు. ఇది తెలియక అమాయకులు వాటిని ఓపెన్ చేయడంతో బ్యాంక్ ఖాతాల్లో నగదు మాయమవుతుందని తెలిపారు. అంతేకాకుండా కొన్ని ఫోన్లను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి ఖాతాల్లో నగదును దోచుకుంటున్నారన్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వడం ద్వారా నగదును హోల్డ్‌లో పెట్టించవచ్చన్నారు. కొంత మంది తాము బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని, అకౌంట్ నంబరు ఇదేనా అంటూ కాల్ చేసి ఓటీపీ అడిగి నగదును విత్ డ్రా చేస్తున్న సంఘటనలు లేకపోలేదన్నారు. రోజు రోజుకూ సైబర్ మోసాలు పెరిగిపోతున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.

సీపీఐ జిల్లా సదస్సు విజయవంతం చేయండి



సదస్సు కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఐ జిల్లా నాయకులు

యలమంచిలి రూరల్: నర్సీపట్నంలో ఈ నెల 11న జరగనున్న సీపీఐ జిల్లా సదస్సును జయప్రదం చేయాలని మంగళవారం యలమంచిలిలో ఆ పార్టీ నాయకులు కరపత్రాలు విడుదల చేశారు. దేశంలో కార్మిక, కర్షక, శ్రమ జీవుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ విధానాల వల్ల సామాన్యులు బతకలేని పరిస్థితి ఏర్పడిందని సీపీఐ నేతలు ఆరోపించారు. విభజన హామీల అమలు, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ తదితర డిమాండ్లతో నిర్వహిస్తున్న సదస్సుకు సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి తదితరులు హాజరవుతారన్నారు. అనంతరం పట్టణంలో సదస్సు కరపత్రాలను స్థానికులకు పంచారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సన్యాసిరావు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బీ బాబ్జీ, ఇతర జిల్లా నాయకులు మణికంఠ, సంతోష్, సునీల్, పోతురాజు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై దృష్టి సారించాలి



సమావేశానికి హాజరైన బీఎల్‌వోలు



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మనోరమ

మునగపాక: ఓటరు నమోదుపై దృష్టి సారించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మనోరమ కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ హాలులో బీఎల్‌వోలతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. చేర్పులు, మార్పులతో పాటు తొలగింపులపైనా దృష్టి సారించాలన్నారు. ప్రతీ బీఎల్‌వో బాధ్యతగా పనిచేయాలన్నారు. నియోజకవర్గ ఎన్నికల సెల్ డీటీ వాలేశ్వరరావు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

పొలాలకు దారి కల్పించాలని వినతి



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలో డీఆర్‌డీవో ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ప్రహరీ నిర్మాణ పనులను తహశీల్దార్ శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తమ పొలాలకు వెళ్లేందుకు దారి కల్పించాలని కేజీపాలెం రైతులు ఆయన్ను కోరారు. ఈ విషయమై డీఆర్‌డీవో ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆర్‌ఐ రవికుమార్, ఎస్‌ఐ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న బ్యాంకు అధికారులు

ఎస్.రాయవరం: కూటమి నేతల సిఫార్సులకు ప్రాధాన్యమివ్వడంతో మండలంలో కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూకు పలువురు దరఖాస్తుదారులు హాజరు కాలేదు. కూటమి ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, కాపు, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు ఆహ్వానించగా, 28 గ్రామాల నుంచి 522 దరఖాస్తులు వచ్చాయి. ఈ మేరకు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బ్యాంకు మేనేజర్లతో మొక్కుబడిగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. దీనికి 220 మందే హాజరైనట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. ముందుగానే కూటమి నేతలు లబ్ధిదారులు ఎంపిక నిర్ణయించడంతో మిగిలిన వారు తమకు రుణాలు రావని తెలిసి ఇంటర్వ్యూకు హాజరు కాలేదు. బ్యాంకు విల్లింగ్ ఉన్నా, కూటమి నేతల సిఫార్సులకు ప్రాధాన్యమివ్వడంతో ఇళ్ల వద్ద ఉండిపోయారు.

వాటర్‌బెల్ సమయంలో తప్పక నీరు తాగాలి



విద్యార్థులతో నీటిని తాగిస్తున్న ఎంఈవో ప్రసాద్

కె.కోటపాడు : వేసవికాలం కావడం వల్ల విద్యార్థులు తాగునీటిని ఎక్కువగా తీసుకోవడం ముఖ్యమని మండల విద్యాశాఖాధికారి డీవీడీ ప్రసాద్ అన్నారు. వారాడ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం వాటర్‌బెల్ కార్యక్రమంపై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. వేసవి ఉష్ణోగ్రతల కారణంగా డీహైడ్రేషన్ బారిన విద్యార్థులు పడే అవకాశం ఉందన్నారు. అందువల్ల ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి రోజు బడి నిర్వహణ సమయంలో ఉదయం 10, 11, 12 గంటల సమయంలో తప్పనిసరిగా ఉపాధ్యాయులు వాటర్‌బెల్ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఎంఈవో సూచించారు.

హామీల అమలుపై పోరుబాటకు సిద్ధం కావాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి



సభలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ

నర్సీపట్నం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు ఏరు దాటాక తెప్ప తగలేసినట్టు ఉందని, ఎన్నికల హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు పోరుబాటకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అన్నారు. సీపీఐ రెండవ మహాసభ గబ్బాడలో మాకిరెడ్డి సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలేపల్లి మాట్లాడుతూ కేంద్రంలో రెండుసార్లు అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వ విధానాల వల్ల దేశం సర్వనాశనమైందన్నారు. దేశ సంపదను కార్పొరేట్లకు పరం చేయడానికి ప్రధాని మోదీ కంకణం కట్టుకున్నారని విమర్శించారు. గత ప్రభుత్వంలోనే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న ప్రధాని వాగ్దానం అమలుకు నోచుకోలేదన్నారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి పరిపాలన కొనసాగించడం ప్రజలను మోసం చేయడమే అన్నారు. మహిళలకు ఉచిత బస్సు, అమ్మకు వందనం, రైతు భరోసా వంటి హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు డిసిహెచ్. క్రాంతి, నల్లబెల్లి శ్రీరామ్మూర్తి, సీనియర్ నాయకులు పి.గంగాభవాని, మాకిరెడ్డి రాజుబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేరి రాయితీలు పొందండి



కుముదాంపేటలో విద్యార్థి వివరాలు తీసుకుంటున్న అధ్యాపకులు

బుచ్చెయ్యపేట: ప్రభుత్వ కాలేజీలో చేరి పలు రాయితీలు పొందాలని వడ్డాది ప్రభుత్వ జూనియర్ కాలేజీ అధ్యాపకులు విద్యార్థులకు సూచించారు. మంగళవారం కుముదాంపేట, భీమవరం తదితర గ్రామాల్లో కాంపెయినింగ్ నిర్వహించారు. పదో తరగతి పాసైన విద్యార్థుల ఇంటికెళ్లి వడ్డాది ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేరాలని ఉన్నత విద్య అందిస్తామని భరోసా కల్పించారు. మధ్యాహ్న భోజనంతో పాటు నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, బ్యాగ్ ఉచితంగా అందిస్తామన్నారు. ప్రైవేటు కాలేజీ యాజమాన్యాల మాటలు వింటే ఆర్థిక ఇబ్బందులు పడతారని ఉన్నత విద్య అందించే ప్రభుత్వ కాలేజీలో చేరాలని కోరారు. తొలిరోజు పది మంది విద్యార్థులు కాలేజీలో జాయిన్ అవడానికి ముందుకొచ్చారని, ప్రతి రోజూ పలు గ్రామాల్లో కాంపెయినింగ్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రిన్సిపాల్ అన్నపూర్ణ తెలిపారు.